నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, ఆదివారం 17 నవంబర్ 2024 YADADRI BHUVANAGIRI

## రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మిర్యాలగూడ విద్యార్థుల ప్రతిభ

మిర్యాలగూడ, నవంబర్ 16: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో ఆర్–3 బ్యాడ్మింటన్ అకాడమిలో మూడు రోజులపాటు నిర్వహించిన అండర్–11, 13 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మిర్యాలగూడ క్రీడాకారులు సత్తా చాటినట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.ప్రశాంత్ తెలిపారు. అండర్–13 సింగిల్స్ బాలుర విభాగంలో టి.అక్షిత్‌రెడ్డి, అండర్–11 డబుల్స్ విభాగంలో గోపిశెట్టి దీపక్‌నాయుడు, ఆకుల రామ్‌చరణ్ విజేతలుగా నిలిచినట్లు పేర్కొన్నారు. శనివారం విద్యార్థులను జిల్లా కోచ్ రామకృష్ణ, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.నవీన్ అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రశాంత్

# ఇంకిన భూగర్భ జలాలు

## జిల్లాలో గణనీయంగా పడిపోయిన గంగమ్మ

- నారాయణపురం, ఆత్మకూర్(ఎం)లో మరీ దారుణం
- 14మండలాల్లో అడుగంటిన పాతాళ గంగ
- 3,19,320 ఎకరాల్లో పంటలకు యాక్షన్ ప్లాన్
- గత యాసంగిలో నీళ్లు లేక పంటలు ఆగం
- ఈ సారైనా సాగునీటి తిప్పలు తప్పేనా?

### అక్టోబర్‌లో సగటున 8మీటర్ల లోతులో నీళ్లు

### గతేడాదితో పోలిస్తే తగ్గిన 3మీటర్ల నీటిమట్టం

**జిల్లాలో రోజురోజుకూ భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. గతంలో పుష్కలంగా ఉన్న పాతాళ గంగ ఇప్పుడు అడుగంటుతున్నది. గతేడాది అక్టోబర్‌తో పోలిస్తే ఈ సారి 3మీటర్ల మేర నీళ్లు కిందికి పడిపోయాయి. 14 మండలాల్లో నీటి మట్టం గణనీయంగా తగ్గిపోయింది.**

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ)

యాదాద్రి భువనగిరి జిల్లాలో కొన్నేండ్లుగా భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయి. ఏటా గంగమ్మ పైకి ఉబికివచ్చేది. నాలుగు నుంచి ఐదు మీటర్ల దూరంలోనే నీటిమట్టం ఉండేది. ఇందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన అనేక కార్యక్రమాలు దోహదం చేశాయి. కానీ.. ఈ ఏడాది వివిధ కారణాలతో భూగర్భజలాలు ఇంకిపోయాయి. ఈ ఏడాది వానలు అరకొరగానే కురిశాయి. జిల్లాలో ఈ ఏడాది అక్టోబర్ వరకు సగటున 8 మీటర్ల లోతున నీళ్లున్నాయి. గతేడాది ఇదే నెలలో కేవలం 5 మీటర్లలో నీళ్లు ఉన్నాయి. అంటే ఇప్పుడు 3మీటర్ల మేర నీళ్లు తగ్గిపోయాయి.



### 14 మండలాల్లో ఘోరం

జిల్లాలోని 14మండలాల్లో నీటి మట్టం గణనీయంగా తగ్గింది. అత్యధికంగా సంస్థాన్ నారాయణపురం మండలంలో 11.42 మీటర్ల మేర కిందికి పడిపోయాయి. ఇక్కడ గత ఏడాది అక్టోబర్‌లో 7.7 మీటర్ల లోతులో నీళ్లు ఉండగా.. ఈ సారి 19.18 మీటర్లకు పెరిగిపోయింది. ఆత్మకూర్ (ఎం) మండలంలో 16.39, రామన్నపేటలో 9.52, భువనగిరిలో 9.08, ఆలేరులో 8.97మీటర్ల లోతులో నీటి మట్టం ఉంది.

### యాసంగి పంటలకు యాక్షన్ ప్లాన్ సిద్ధం

జిల్లా వ్యవసాయ అధికారులు యాసంగి సీజన్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువుల ఇండెంట్‌ను రూపొందించారు. అధికారుల అంచనాల ప్రకారం 3,19,320 ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేయనున్నారు. ఇందులో వరి 2.98 లక్షల ఎకరాల్లో, మిగతా పంటలన్నీ కలిపి 21,320 ఎకరాల్లో సాగు చేయనున్నారు. ఇందుకోసం 74,500 క్వింటాళ్ల వరి విత్తనాలు, 57,816 టన్నుల ఎరువులు అవసరమని లెక్కలు వేశారు.

### గత యాసంగిలో నీళ్లు లేక పంటలు ఆగం

జిల్లాలో గత యాసంగి సీజన్ చివరలో నీళ్లు లేకపోవడంతో పంటలు ఆగమయ్యాయి. పొట్ట దశకు వచ్చే సమయంలో సరిపడా నీళ్లు లేక పొలాలు ఎండిపోయాయి. చేసేదేం లేక కొంత మంది రైతులు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరందించే ప్రయత్నం చేశారు. అయినా.. నీళ్లు సరిపోక పంటలు ఎండిపోయాయి. ఈ సారి సీజన్‌కు ముందే నీటి కష్టాలు ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తున్నది. భూగర్భ జలాలు ఇంకిపోతుండటంతో నీటి మట్టం తగ్గిపోతున్నది. దాంతో అనేక చోట్ల బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. ఈ క్రమంలో రెండో పంటలో వరి వేయొద్దని, వరి మినహా ఏ పంటలైనా సాగు చేసుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

## గంజాయిపై ఉక్కుపాదం మోపాలి

- విద్యార్థులు, యువత మత్తు బారిన పడకుండా చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 16 : గంజాయిపై ఉక్కుపాదం మోపాలని, విద్యార్థులు, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని మినీ మీటింగ్ హాల్‌లో గంజాయిపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి అమ్మే కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గంజాయి రహిత జిల్లాగా మార్చాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువకులు గంజాయికి బానిస కాకుండా చూడాలని, హైరిస్క్ ప్రాంతాల్లో నిఘా పెంచి అవసరమైతే కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాకు సరిహద్దు రాష్ట్రాల నుంచి గంజాయి పదార్థాలు రాకుండా అన్ని చెక్ పోస్టుల్లో నిఘా పెంచాలని, జిల్లాలో గంజాయి సాగును గుర్తించి ధ్వంసం చేసి కేసులు నమోదు చేయాలని పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులకు సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల స్థితిగతులను పరిశీలన చేయాలన్నారు. పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ఎక్సైజ్ అధికారులు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు గంజాయి వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. గుడుంబాపై ఉక్కుపాదం మోపాలని పోలీస్, ఎక్సైజ్ అధికారులకు సూచించారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ జిల్లా అంతటా గట్టి నిఘా ఉంచామన్నారు. గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గంగాధర్, వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, ఎక్సైజ్, ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ సైదులు, జిల్లా పంచాయతీ అధికారి సునంద, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నేడు గ్రూప్-3 పరీక్ష | జిల్లాలో 6,043 మంది అభ్యర్థులు

- 15 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- తొలి రోజు రెండు పేపర్లు
- అభ్యర్థులకు బయోమెట్రిక్ హాజరు నమోదు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 16 :: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో నిర్వహించే గ్రూప్ –3 పరీక్షకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో 15 కేంద్రాలు ఏర్పాటు చేయగా..6,043 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణకు వివిధ స్థాయిల్లో 419 మంది అధికారులను నియమించారు. ఇందులో 15మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 46మంది బయోమెట్రిక్ అధికారులు, 17మంది అబ్జర్వర్లు, ముగ్గురు జాయింట్ రూట్ అధికారులు, ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్స్, 15మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 65మంది ఐడెంటిఫికేషన్ అధికారులు, 253మంది ఇన్విజిలేటర్లు పాల్గొననున్నారు. అభ్యర్థులు పరీక్షకు నిర్ణీత సమయానికి గంట ముందుగానే చేరుకోవాల్సి ఉంటుంది. ప్రతి అభ్యర్థికీ బయోమెట్రిక్ హాజరు నమోదు చేస్తున్నారు. పటిష్ట భద్రత మధ్య ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకున్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించారు. అన్ని కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రంలోని అధికారులు, సిబ్బంది విధిగా ఐడీ కార్డులు ధరించాల్సి ఉంటుంది. పరీక్ష మెటీరియల్స్ తరలింపునకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

**రెండు రోజులు.. మూడు పరీక్షలు**

ఆదివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్ –1 (జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్) పరీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్–2 (హిస్టరీ, పొలిటీ అండ్ సొసైటీ) పరీక్ష నిర్వహిస్తారు. సోమవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు పేపర్ –3 (ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్) పరీక్ష ఉంటుంది. అయితే.. ఉదయం 9:30కు, మధ్యాహ్నం 2:30 గంటలకే పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారు. అభ్యర్థులకు పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్లు ఓఎంఆర్ షీట్ పూర్తి చేసే విధానంపై అవగాహన కల్పిస్తారు. దాని తర్వాతే వ్యక్తిగత వివరాలు పూర్తిచేయాల్సి ఉంటుంది. తప్పులు చేస్తే సరిచేయడానికి అవకాశం ఉండదు. కాబట్టి అభ్యర్థులు జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్, బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్ను, ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసుకురావాల్సి ఉంటుంది.

**వీటిని అనుమతించరు...**

అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి ఉదయం 9నుంచి అనుమతిస్తారు. 9:30 గంటల తర్వాత అనుమతించరు. పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ వాచ్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదు. కాళ్లకు చెప్పులు మాత్రమే ధరించాలి. షూ వేసుకొని రావద్దు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతారు. అన్ని కేంద్రాల వద్ద పరీక్ష ముగిసే వరకు నిరంతరాయంగా విద్యుత్ ఉండేలా చర్యలు తీసుకున్నారు.



బీసీ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావుకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

## బీసీ రిజర్వేషన్లలో సీలింగ్ ఎత్తివేయాలి

- కుల గణన తర్వాత దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి
- డెడికేషన్ కమిషన్‌కు పలువురి వినతి
- ప్రభుత్వానికి నివేదిస్తామన్న కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు

నల్లగొండ, నవంబర్ 16 : 'స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి రిజర్వేషన్ల అమలులో బీసీలకు అన్యాయం జరుగుతుంది. ప్రస్తుతం కుల గణన చేస్తున్న ప్రభుత్వం దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి. విద్య, ఉద్యోగాల్లో ఇచ్చినట్లే స్థానిక సంస్థల్లో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలి. పార్లమెంట్‌లో చట్టం చేస్తే తప్ప దీనికి శాశ్వత పరిష్కారం లేదు.' అని బీసీ సంఘాల ప్రతినిధులు, అసోసియేషన్ల నాయకులు బీసీ కమిషన్ బృందానికి వివరించారు. వెనుకబడిన తరగతుల డెడికేషన్ కమిషన్ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల గుర్తింపు అంశంపై శనివారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కుల సంఘాలతో బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ విచారణకు రాష్ట్ర డెడికేషన్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి బి.సైదులు హాజరై వినతులు స్వీకరించారు. సలహాలు తీసుకున్నారు.

**రిజర్వేషన్ల అమలుపై పలు డిమాండ్లు**

స్థానిక సంస్థల రిజర్వేషన్లలో బీసీలకు న్యాయం జరుగడానికి బీసీ సంఘాల ప్రతినిధులు పలు డిమాండ్లను బీసీ కమిషన్ బృందం వద్ద పెట్టారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం 50శాతం రిజర్వేషన్లకు మించి అమలు చేసే పరిస్థితి లేనందున పార్లమెంట్‌లో చట్టం చేసి రాష్ట్రంలో కులగణన ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయాలని అన్ని సంఘాల ప్రతినిధులు కోరారు. బీసీ–ఏలో సంచార జాతులను మాత్రమే చేర్చాలని, ఎంబీసీ కార్పొరేషన్ తీసేసి సంచార జాతుల కార్పొరేషన్ అమలు చేయాలని మరికొందరు విన్నవించారు. బీసీ రిజర్వేషన్లలో మహిళలకు 50శాతం అమలు చేయాలని, అది సర్పంచులు, ఎంపీపీలు, జడ్పీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్ల పదవులకు కూడా వర్తింపజేయాలని కోరారు.

**ప్రభుత్వానికి విన్నవిస్తాం**
**చైర్మన్ వెంకటేశ్వర్‌రావు**

బీసీ సంఘాల ప్రతినిధులు ఇచ్చిన వినతులను ప్రభుత్వానికి నివేదిస్తామని డెడికేషన్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్‌రావు అన్నారు. వినతుల స్వీకరణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పూర్తి చేశామని, త్వరలో అన్ని జిల్లాల్లో చేపట్టి ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున వచ్చి వినతుల ఇచ్చారని అందులో బీసీల జనాబా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్ ఎక్కువగా వచ్చిందని అన్నారు. ఆ తర్వాత కులాల వారిగా విభజన చేసి దాని ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని కొందరు, ఏబీసీడీ వర్గాలకు విభజించాలని మరి కొందరు విన్నవించినట్లు తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆయనకు బొకే అందజేసి స్వాగతం పలికారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, డీఆర్వో అమరేందర్, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్, ఉమ్మడి జిల్లా బీసీ అభివృద్ధి అదికారులు పాల్గొన్నారు.

**నాలుగు గోడల మధ్య బహిరంగ విచారణ?**

బహిరంగ విచారణ అని చెప్పి నాలుగు గోడల మధ్య ఏంటని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు లొడంగి శ్రవణ్‌కుమార్ ప్రశ్నించారు. బహిరంగ విచారణ అని చెప్పిన అధికారులు ప్రతి సంఘం లేదా వ్యక్తిగతంగా వచ్చిన వారి పేర్లు ఎంట్రీ చేసుకొని ఆ తర్వాత ఒక్కొక్కరిని చాంబర్‌లోకి పిలిపించి వినతులు స్వీకరించారు. అయితే.. రిజర్వేషన్లపై మాత్రమే ఈ కమిటీ వినతులు స్వీకరిస్తుండగా.. కొందరు ఇతర సమస్యలపై మాట్లాడటంతో వాటిని వద్దని వారించడంతో వెనుదిరిగారు.

### రిజర్వేషన్లపై సీలింగ్ ఎత్తివేసేందుకు పార్లమెంట్‌లో చట్టం చేయాలి

- కొండూరు సత్యనారాయణ, ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షుడు

సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం రిజర్వేషన్లు 50శాతం మించి అమలు చేసే పరిస్థితి లేదు. మొదట పార్లమెంట్‌లో సీలింగ్ ఎత్తేసే విధంగా చట్టం చేయాలి. ప్రస్తుతం కులగణన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి. మొక్కుబడిగా కుల గణన చేయడం, బీసీ సంఘాల ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరించి వదిలేయడం చేయవద్దు.





బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- భువనగిరి ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించిన విద్యార్థులు
- కార్యాలయానికి తాళం వేసి నిరసన

భువనగిరి అర్బన్, నవంబర్ 16 : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం భువనగిరి ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. అంతకుముందు పెద్ద ఎత్తున తరలివచ్చిన కాలేజీ విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ముట్టడి సందర్భంగా ఆర్డీఓ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. దాంతో విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీ రాందేవ్ మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన ఫీజు బకాయిలు రూ.7500 కోట్లను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి రూ.20వేల స్కాలర్‌షిప్ ఇవ్వాలని, కాలేజీ ఫీజులను ప్రభుత్వమే పూర్తిగా భరించాలని డిమాండ్ చేశారు. జీఓ 29ని రద్దు చేసి ఖాళీగా ఉన్న రెండు లక్షలా 50వేల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. స్కైఓవర్లు, ఫ్లైఓవర్లు, ఎమ్మెల్యేల ఆఫీసులు కట్టడానికి, మంత్రులకు కార్లు కొనడానికి డబ్బులు ఉంటాయిగానీ.. విద్యార్థుల స్కాలర్‌షిప్ ఇవ్వడానికి లేవా? అని ప్రశ్నించారు. మూసీ మురికి తీయడానికి రూ.1.50లక్షల కోట్లు ఉంటాయి.. విద్యార్థుల భవిష్యత్ కాపాడడానికి డబ్బులు లేవా? అన్నారు. వంద రోజుల్లో విద్యార్థులకు స్కూటీలు, విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామన్న సంగతి మరిచిపోయారని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రూ.1800 నుంచి రూ.15వేలకు పెంచాలని, ప్రతి విద్యార్థికి విదేశీ విద్య స్కాలర్‌షిప్ ఇవ్వాలని, హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు రూ.3వేలకు పెంచాలని, గురుకులాల్లో మెరుగైన వసతులు కల్పించి సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూనావత్ అరుణ్‌నాయక్, బీసీ యువజన సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా కన్వీనర్ ఎడ్ల మహలింగం, నాయకులు పసుల శివ, ఆమన్, శివమణి, భూక్యా బాలాజీ, రామ్‌చరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ రూరల్, నవంబర్ 16 : రైతులు ఆరుగాలం పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మండలంలోని ఎర్రవరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2014కు ముందు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. స్వరాష్ట్రంలో కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగ చేస్తే నేడు కాంగ్రెస్ దండుగ చేసి రైతులను ఆగమాగం చేసిందని ఆరోపించారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 20 రోజులు కావస్తున్నా నేటికీ కాంటాలు కావడం లేదన్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో ప్రైవేటు వ్యాపారులకు అమ్ముంటున్నారని తెలిపారు. వాతావరణం మబ్బులుగా ఉండటంతో రైతులు పగలు ఆరబోసుకోవడం, రాత్రి ఎత్తిపోసుకోవడం చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ రైతులు ఆగమవుతున్నా రాష్ట్ర మంత్రులు పట్టించుకోకుండా ఎన్నికల పేరుతో ఇతర రాష్ట్రాల్లో ఎంజాయ్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించే వరకూ ఆందోళనలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి సురేశ్‌నాయుడు, నాయకులు దొంగల లక్ష్మీనారాయణ, దొంతగాని అప్పారావు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, అంజిరెడ్డి, రమేశ్, ఉద్దండు, చంద్యా, వీరు, బోసు, జగ్గయ్య, వెంకట్‌రెడ్డి, పూర్ణయ్య, పాపారావు, మట్టయ్య పాల్గొన్నారు.



## ఘనంగా కంఠమహేశ్వరస్వామి బోనాలు

చౌటుప్పల్, నవంబర్ 16 : పట్టణంలో సురమాంబ, కంఠమహేశ్వరస్వామి బోనాల పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో ఊరేగింపుగా వచ్చి బొడ్రాయి చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆలయానికి తరలివెళ్లారు. పోతరాజుల విన్యాసాలు, కళాకారుల ఆటాపాటల మధ్య బోనాలతో వెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అదేవిధంగా ఎల్లమ్మ తల్లి, వనం మైసమ్మకు కూడా బోనాలు సమర్పించారు. బోనాల మహోత్సవాన్ని తిలకించేందుకు పట్టణ ప్రజలు, గౌడ కులస్తులు, వారి బంధువులు పెద్ద ఎత్తున రావడంతో పట్టణంలో సందడి నెలకొంది. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఉత్సవాలకు హాజరై ఆలయంలో పూజలు చేశారు.